కాలేజీ కల నెరవేరేనా!

- డొంకేశ్వర్‌లో ఇంటర్ కళాశాల ఏర్పాటుకు డిమాండ్
- కొన్నేళ్లుగా విన్నవిస్తున్న మండల వాసులు
- స్పందించిన జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ

డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా ఈ డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపలేదు. ఇటీవల జూనియర్ కాలేజీ ప్రస్తావన మళ్లీ తెరపైకి వచ్చింది. డొంకేశ్వర్ గ్రామం మండలంగా ఏర్పాటు కావడంతో కాలేజీ కావాలన్న ప్రతిపాదనకు మరింత బలం పెరిగింది. దీనికి తోడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం సమ్మతి తెలుపుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాల కలను నెరవేర్చుకోవడానికి మండల వాసులు పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల డొంకేశ్వర్ మండల కేంద్రానికి వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సరేనన్నారు. మండల వాసుల విన్నపం మేరకు కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తానని, ఇంటర్ బోర్డు అధికారులతో కూడా మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయిస్తానని మాటిచ్చారు. దీంతో డొంకేశ్వర్‌లో ఇంటర్ కాలేజీ ఏర్పాటుపై ఆశలు చిగురించాయి. కాలేజీ మంజూరైతే భవన నిర్మాణానికి మండల కేంద్రంలో స్థలం ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు అంటున్నారు.

ఎంతో మేలు

డొంకేశ్వర్‌లో ప్రభుత్వం ఇంటర్ కళాశాల ఏర్పాటు జరిగితే చుట్టు పక్కల గ్రామాల్లోని విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది. డొంకేశ్వర్ మండలంలోని పదమూడు గ్రామాల నుంచే కాకుండా నందిపేట్ మండలంలోని గ్రామాల విద్యార్థులకు సైతం చదువుకునేందుకు సులభం అవుతుంది. దాదాపు 20 గ్రామాలకు ఇంటర్‌విద్యా కేంద్రంగా మారనుంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న వందల మంది విద్యార్థులు ఇంటర్ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రయివేటులో డబ్బులు ఖర్చుచేసి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే డొంకేశ్వర్‌లో కాలేజీ ఏర్పాటైతే వారంతా ప్రభుత్వ కళాశాలలోనే ఉచితంగా చదువుకోవచ్చు. దూరభారం కూడా తగ్గనుంది. ముఖ్యంగా పేద విద్యార్థులకు మేలు జరగుతుందని చెప్పవచ్చు. అయితే కాలేజీ కోసం గ్రామస్తులు, జెడ్పీ చైర్మన్ చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాలి.



డొంకేశ్వర్ గ్రామ స్వాగత తోరణం

చాలాసార్లు విన్నవించాం



మండల కేంద్రంగా ఏర్పడకముందు నుంచే డొంకేశ్వర్‌లో ప్రభుత్వ ఇంటర్ కాలేజీ కావాలని డిమాండ్ ఉంది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు చాలాసార్లు విన్నవించాం. ప్రస్తుతం మండలం ఏర్పడిన డొంకేశ్వర్‌లో కాలేజీ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది.

– నాయకుడి చందు, డొంకేశ్వర్

కలెక్టర్ చొరవ తీసుకోవాలి



ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు చుట్టుపక్కల 40కిలో మీటర్లలో ఎక్కడా లేవు. ప్రైవేట్ కాలేజీలే ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు అందులో చేరుతున్నారు. లేదంటే జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని డొంకేశ్వర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించాలి.

– పొగరి సంజీవ్, డొంకేశ్వర్

నూత్‌పల్లి నుంచి తరలనున్న బీసీ గురుకుల పాఠశాల

డొంకేశ్వర్(ఆర్మూర్) : మండలంలోని నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో బోధనతో పాటు వసతికి కూడా ఇబ్బందిగా మారింది. సరైన డైనింగ్ హాల్, బాత్‌రూంలు, టాయిలెట్లు, స్నానాల గదులు లేకపోవడంతో విద్యార్థులకు కష్టంగా మారింది. ఇబ్బందులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో భవనాన్ని మార్చి గురుకులాన్ని వేరే చోటికి తరలించాలని ఆదేశించారు. దీంతో ఆర్మూర్, నందిపేట్ ప్రాంతాల్లో అనువైన భవనాన్ని వెతికే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఎలాగైనా నూత్‌పల్లి నుంచి ఖాళీ చేయాలని భావిస్తున్నారు. కుద్వాన్‌పూర్ గ్రామంలో మంజూరైన ఈ బీసీ గురుకుల పాఠశాల గత ఐదారేళ్లుగా నూత్‌పల్లిలో ప్రభుత్వ హాస్టల్ బిల్డింగ్‌లో కొనసాగిస్తూ వస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అనువైన భవంతి దొరికితే పాఠశాలను వెంటనే మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రిన్సిపాల్ సంతోష్ వెల్లడించారు.



నూత్‌పల్లిలోని బీసీ గురుకుల పాఠశాల

పది జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం



పెర్కిట్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పది జీపీఏ సాధించిన ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. పాఠశాలకు చెందిన రష్మిత, సాయి మాధుర్య, భవజ్ఞ, శరణ్య, సవిత, దేవానంద్, హెచ్‌ఎం నరేందర్‌ను సన్మానించారు.

గ్రంథాలయం పరిశీలన



బోధన్ : బోధన్‌కు చెందిన సామాజిక సేవకురాలు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ గౌరవ అధ్యక్షురాలు గుర్రాల సరోజనమ్మ మంగళవారం సాలూరలోని లైబ్రరీని సందర్శించారు. గ్రామస్తులు ఐక్యతతో లైబ్రరీని ఏర్పాటు చేసుకోవడాన్ని అభినందించారు. పాఠకుల సౌకర్యార్థం మరుగుదొడ్డి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. అద్దంకి ఉషాన్, లింబూరి లక్ష్మణ్, సింగాడే పాండు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై శిక్షణ



రుద్రూర్ : టీబీ వ్యాధి నిర్మూలన కోసం వయోజనులకు ఇవ్వనున్న బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరోగ్య సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బీసీజీ వ్యాక్సిన్ జిల్లా ఇన్‌చార్జి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఫార్మెట్ ప్రకారం 18ఏళ్ల పైబడిన వారి వివరాలు, బీసీజీ టీకాకు అర్హులను గుర్తించాలని సూచించారు. ఈ టీకాను ఇప్పటివరకు శిశువులకు ఇస్తున్నారని పేర్కొన్నారు. వయోజనులకు కూడా ఇవ్వడానికి సర్వే చేయాలని సూచించారు. జిల్లా టీబీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఆయేషా సిద్ధిఖా, మండల ఆరోగ్య విస్తరణాధికారి రాజేందర్, ఎస్‌టీఎల్‌ఎస్ పద్మ, హెల్త్ సూపర్ వైజర్‌లు రవి, సావిత్రి, సుమతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి





ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, బోధన్ డిపో సీఐ జానాబాయికి విన్నవిస్తూ..

ఆర్మూర్ : ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను పెంచి, మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని విస్తరించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఎదుట విప్లవ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆర్మూర్ డిపో మేనేజర్‌కు తమ డిమాండ్లు తెలియజేస్తూ వినతి పత్రం సమర్పించారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు అనిస్, నాయకులు సత్తెవ్వ, రమ, నర్సవ్వ, పుష్పలత, గంగజమున, రమేష్, రాజేశ్వర్, కిషన్, దామోదర్, కిషోర్, అశోక్, బాలయ్య పాల్గొన్నారు.

బోధన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తు మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ప్రగతిశీల మహిళ సంఘం పట్టణ శాఖ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిపో సిఐ జానాబాయికి వినతి పత్రం అందించారు. పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ.. బస్సుల సంఖ్యను తగ్గించడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నాయకులు బీపాషా బేగం, గంగమణి, లక్ష్మి, కళావతి, రేహనాబేగం, సాయవ్వ, హైమదీ, సమీనా బేగం పాల్గొన్నారు.

ప్రజలు యుద్ధాలు కోరుకోవడం లేదు

ఆర్మూర్ : ప్రజలు యుద్ధాలను కోరుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్వేష్ అన్నారు. మండలంలోని మైత్రి గార్డెన్స్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతుల రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఆయన జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు– మన కర్తవ్యం అనే అంశంపై ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాదుల మధ్య నెలకొన్న పోటీయే ప్రపంచ యుద్ధాలకు కారణమయ్యాయన్నారు. ఈ తరగతుల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్, ఎస్ నాగేశ్వరరావు, నరేందర్, అనిల్, పృథ్వి, అఖిల్, సాయి, సురేష్, గణేశ్, అనిల్, అషూర్, వెంకటేష్, దీపిక, కావ్య, సీతారాం, తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



దూపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో



దత్తాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రెంజల్ : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలో సర్వేను ఆయా గ్రామాల కార్యదర్శులు ప్రారంభించారు. దూపల్లి, దండిగుట్ట గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో, ఎంపీవో గౌస్ పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సర్వేను చేపట్టాలని సూచించారు. ఆధార్‌కార్డు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

డొంకేశ్వర్ మండలంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండలంలోని పదమూడు గ్రామాల్లో ఎంపీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఇంటింటి కుళాయి సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ కులాయి కనెక్షన్ ఉందా? ఉంటే అది మిషన్ భగీరథకు సంబంధించినదా? అని వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఎంతమంది, ఇంటి యజమాని పేరు, ఆధార్ నంబరును రికార్డు చేశారు. యాప్‌లో ఫొటోలను అప్లోడ్ చేసి సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీవో కిరణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వరద నీటి ప్రభావిత ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం పరిశీలించారు. వర్షకాలంలో గ్రామంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి వరద నీరు కాలనీల్లోకి ప్రవేశించి రాకపోకలు నిలిచి పోతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించి వర్షపు నీరు నిలిచి పోకుండా చూడాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకుడు అయ్యప్ప శ్రీనివాస్, అధికారులు, స్థానిక కౌన్సిలర్ ఆకుల రాము పాల్గొన్నారు.



మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

పనులను పూర్తి చేయాలి

మాక్లూర్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని కృష్ణనగర్, బోర్గాం (కె) గ్రామాల్లో ఆయన పాఠశాలల్లో పనులను పరిశీలించారు. కృష్ణనగర్‌లో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరాపరా అవుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఎంపీడీవో జె క్రాంతి, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రాయ్ సింగ్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మనోహర్‌రావు, మాక్లూర్ జీపీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

ఆధ్యాత్మికం..

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మాక్లూర్ : మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో ముందుగా యజ్ఞ కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. బిగాల మహేశ్‌గుప్తా, రామాలయ చైర్మన్ సాయికుమార్, కమిటీ సభ్యులు ఈరముళ్ల లక్ష్మీనారాయణ, కాశీనాథ్ రావు, మాజీసర్పంచ్ రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శివలింగాల తయారీ



బోధన్‌టౌన్ : కాశీలో జరిగే శివలింగార్చన కోసం పట్టణంలోని కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో శివలింగాలను మహిళలు తయారు చేస్తున్నారు. రెండు వేల శివలింగాలు తయారు చేయాలన్న ఆదేశాలను సారం, మట్టి రాగా ఇప్పటికే 500 శివలింగాల ప్రతిమలను తయారు చేశారు. గంజి ధనలక్ష్మి, కొత్త పద్మావతి, కంటాల అనురాధ, చింతల పద్మ, జయశ్రీ, ప్రమిల, ప్రతిభ తదితరులు ఉన్నారు.

ఆలూర్ గురుకుల ప్రిన్సిపాల్‌కు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్) : ఆలూర్‌లోని మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్‌ను హైదరాబాద్‌లో మంగళవారం మైనార్టీ గురుకుల సంస్థ అధ్యక్షుడు మొహ్మద్ ఫహీం ఖురేషి, హజ్ కమిటీ స్పెషల్ ఆఫీసర్ లియాకత్ హుస్సేన్ సన్మానించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పది జీపీఏ సాధించడంతో ఆయనను అభినందించారు.

రుద్రూర్‌కు నోట్ బుక్స్ సరఫరా



రుద్రూర్ : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రానికి మంగళవారం ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ బుక్స్ వచ్చాయి. రెండు దఫాలుగా 16,450 నోట్ బుక్స్ సరాఫరా చేశారు. ఇప్పటికే తొలి విడతలో ఏడు వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వీటిని ఆయా పాఠశాలల బాధ్యులకు అందిస్తామని ఎంఐఎస్ కో ఆర్డినేటర్ శంకర్, సీఆర్‌పీలు అంబర్ సింగ్, మౌనిక తెలిపారు.

సమాచారం..

నేడు పుస్తకాల పంపిణీ

బోధన్ : బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంఈవో నాగ్ నాథ్ తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో మాత్రమే పిల్లలను చేర్పించాలని ఆయన సూచించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌బాయ్స్ (తెలుగు) - 11.05, వెపన్ (తెలుగు) - 1.50, భజే వాయువేగం - 4.30, లవ్‌మౌళి (తెలుగు) - 7.25, రక్షణ - 10.30

స్క్రీన్-3 – మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30

స్క్రీన్-4 – సత్యభామ - 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి - 1.45, బ్యాడ్‌బాయ్స్ - 7.45

క్లుప్తంగా

స్కూల్ బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలి



బోధన్: డివిజన్ పరిధిలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లకు సంబంధించిన బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో ఏఎంవీఐ శ్రీనివాస్‌కు డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్, ప్రతినిధి శివ వినతి పత్రం అందించారు. నిబంధనల ప్రకారం స్కూల్ బస్సు డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యుడికి అవార్డు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం సభ్యుడు మహమ్మద్ రఫీఉద్దీన్ బెస్ట్ అవుట్ స్టాండింగ్ డిస్ట్రిక్ సెక్రెటరీ అవార్డును అందుకున్నారు. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌లో లయన్స్ ఇంటర్నేషల్ వైటల్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి అవార్డులు అందజేశారు.

ఇంటి దీపం సంఘం మహాజన సభ



మాక్లూర్ : ఇంటి దీపం ఉత్పత్తిదారుల సంఘం నుంచి సభ్యులకు రూ.4.50 కోట్లు రుణాలు ఇవ్వగా వడ్డీ రూపంలో రూ.20 లక్షలు మిగులుబాటు అయిందని సంఘ అధ్యక్షురాలు భూపతి చిన్నుబాయి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రఫత్‌ఖాన్ గార్డెన్‌లో సంఘ మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నుబాయి మాట్లాడుతూ, 2023– 2024కు ఆర్థిక బడ్జెట్ సంఘ సభ్యులకు లాభాన్ని తెచ్చి పెట్టిందన్నారు. ఈ ఏడాది మరో 20 కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, రూ.1.70 కోట్ల రుణాలు ఇవ్వాలని తీర్మానం చేయనున్నట్టు చిన్నుబాయి వెల్లడించారు. అనంతరం సంఘ లావాదేవీలను మేనేజర్ ప్రభాకర్ చదివి వినిపించారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కోకా హైమద్, మాక్లూర్ మాజీ ఉపసర్పంచ్ అనిత, సంఘ సభ్యులు పెద్దమ్మ, పుష్ప, చంద్రకళ, కట్ట సంపూర్ణ, రుచిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల పక్షపతి మోదీ



ఆర్మూర్‌టౌన్ : ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సంతకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదలపై చేయడం ఆనందంగా ఉందని, మోదీ రైతుల పక్షపతి అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, బీజేపీ జిల్లాకిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 33 లక్షల మంది రైతులకు రూ.660 కోట్లు లబ్ధి చేకూరుందన్నారు.

గోవుల తరలింపును అరికట్టాలి



వర్ని (మోస్రా): అక్రమంగా గోవుల తరలింపును అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మోస్రా తహసీల్దార్ కార్యాలయంలో, గ్రామ పంచాయతీలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. గోవులను అక్రమంగా ఆటోలు, డీసీఎంలు, లారీలలో తరలించి వధిస్తున్నారని ఈ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిలిపివేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన 'పొలాస' విద్యార్థులు



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా అంకాపూర్‌ను సందర్శించారు. అంకాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రాలను, విత్తన శుద్ధి కర్మగారాలను పరిశీలించారు. అంకాపూర్ రైతులు సాగు విధానంలో చేపడుతున్న పద్ధతులను ఆదర్శ రైతు భాజన్న వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు సౌజన్య, ప్రజ్ఞ పాల్గొన్నారు.

సంక్షిప్తం

హామీలను అమలు చేయాలి



బోధన్‌రూరల్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ సి. గోపాల్ రావు అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో వీహెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6వేల ఫింఛన్ అందించాలని, సమస్యల పరిష్కరం కోసం కృషి చేయలన్నారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, ఉపాధ్యక్షులు నారాయణ, సాయిలు, అబ్బయ్య, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

రెంజల్ : మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం సర్కారు బడులను బలోపేతం చేస్తుందని వివరించారు. అన్ని రకాల వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంఈవో గణేశ్‌రావు, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సోమలింగంగౌడ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, ప్రభాకర్, రాధ పాల్గొన్నారు.

యంచ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు

నవీపేట : మండలంలోని యంచ గ్రామంలో ప్రత్యేక చెక్‌పోస్టను ఏర్పాటు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో గోవులను తరలిస్తారనే ఫిర్యాదులు రావడంతో ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు.

బోధన్‌లో మోస్తరు వర్షం

బోధన్ : నియోజకవర్గం పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, సాలూర, రెంజల్ మండలాల్లో మంగళవారం సాయంత్రం అరగంట పాటు మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురిసిన సమయంలో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షాకాలం ప్రారంభం తర్వాత తొలిసారిగా మోస్తరు వర్షం కురిసింది.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రుద్రూర్ : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి సూచించారు. పోతంగల్ మండలం చేతన్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా శిశు, మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వాలు పౌష్టికాహారం అందిస్తున్నాయని తెలిపారు.

యూనిఫాంల పంపిణీ



భీమ్‌గల్ : మండలంలోని బడాభీమ్‌గల్, బాచన్‌పల్లి గ్రామాల్లో విద్యార్థులకు ఎంఈవో స్వామి, ఏపీఎం రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం యూనిఫాంలు పంపిణీ చేశారు. సీనియర్ సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గడాల రఘుపతి, బాస్కర్, లలిత పాల్గొన్నారు.